క్లుప్తంగా

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే స్కూళ్ల అభివృద్ధి

పెళ్లకూరు: తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని ఎంఈవో శంకరయ్య తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో సోమవారం స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యాప్రవేశం, ప్రహరీ క్లబ్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. తరగతి గది పరిశీలన, బోధనాపరికరాలు తదితరాలపై అవగాహన కల్పించారు. కాలానుగుణంగా టెక్నాలజీని మేళవించి పిల్లలకు విద్యా బోధన చేయాలని సూచించారు.

రేపు కొత్తపట్నంలో గ్రామసభ

కోట:మండలంలోని కొత్తపట్నంలో బుధవారం భూసర్వేపై గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జయజయరావు తెలిపారు. కొత్తపట్నంతో పాటు శ్రీనివాససత్రం, యమదిన్నెపాళెం, గున్నంపడియ, గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, మిట్టపాళెం, వావిళ్లదొరువులోని ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే చేసినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో కొత్తపట్నం సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించి సర్వే వివరాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అభ్యంతరాలు ఉన్న వారు అర్జీలు ఇవ్వాలన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం

సైదాపురం: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రశాంతి తెలిపారు. ఆమె సోమవారం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. రోగులను పరిశీలించి మందులు అందజేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాపూరు: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు సోమవారం వైద్యులు సుదర్శనమ్మ రక్తహీనత పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ రక్తం తక్కువ ఉన్న చిన్నారులను గుర్తించి వారికి మందులు అందజేసినట్టు తెలిపారు. తద్వారా మూడు నెలల్లో రక్తం వృద్ధి చెందేలా చూస్తామని వెల్లడించారు. 173 మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్రిష్టియానా జేమ్స్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెళ్లకూరు/నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలం పండ్లూరు వద్ద సోమవారం, పెళ్లకూరు మండలంలోని కలవకూరు వద్ద ఆదివారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న పది ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు నాయుడుపేట సీఐ బాబి, పెళ్లకూరు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. నాయుడుపేట సమీపంలోని మామిడి కాలువ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో సీఐ తమ సిబ్బందితో కలిసి పండ్లూరు వద్ద ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. పండ్లూరుకు చెందిన డ్రైవర్లు ఏలూరు మస్తానయ్య, తుపాకుల నాగరాజు, ములకాల దయాకర్, ములకాల గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారితోపాటు ట్రాక్టర్ యాజమానులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అలాగే పెళ్లకూరు మండలం కలవకూరు, పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట గ్రామాలకు చెందిన ఇసుక ట్రాక్టర్ల యజమానులు స్వర్ణముఖి నది నుంచి ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాటిపై కేసు నమోదు చేశారు.

సమస్యలపై అధికారులతో వైఎస్సార్ సీపీ నేతల చర్చ

వాకాడు : అధికారం ఉన్నా లేకపోయినా వైఎస్సార్ సీపీ నేతలు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో జెడ్పీటీసీ రౌతు రామకృష్ణ, ఎంపీపీ అనసూయమ్మ ముఖ్య ప్రతినిధి కొడవలూరు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజల సమస్యలపై అధికారులతో చర్చించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, లేకుంటే పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. అధికారంలో ఉన్న కూటమి నేతలు తమ సమస్యల గురించి పట్టించుకోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

వెంకటగిరి రూరల్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం వెంకటగిరి పట్టణంలోని రాణిపేటలో ఉన్న బాలసదన్‌లో వెంకటగిరి ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ ఖాన్, రవి, రజాక్, మోహన్‌మల్లి పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంకు గాయాలు

పెళ్లకూరు: మండలంలోని అక్కగారిపేట గ్రామ సమీపంలోని 71వ నంబరు జాతీయ రహదారిలో సోమవారం రాత్రి ఆటో నుంచి జారిపడి ఏఎన్‌ఎం పవిత్ర తీవ్రంగా గాయపడింది. కొత్తూరుకు చెందిన టైలర్ బాబు కుమార్తె పవిత్ర తిరుపతిలో ఏఎన్‌ఎంగా పని చేస్తోంది. సోమవారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని ఆర్టీసీ బస్సులో తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి చేరుకుంది. అక్కడ ఆటోలో కొత్తూరుకు వెళుతుండగా అక్కగారిపేట సమీపంలో జారి పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను బైక్‌లో శ్రీకాళహస్తికి తరలించారు.

వినూత్నంగా మొక్కజొన్న సాగు

ఆ యువకుడు బాగా చదువుకున్నాడు. మంచి ఉద్యోగంలో స్థిరపడాలన్న తండ్రి కోరికను పక్కన పెట్టాడు. తండ్రి చేస్తున్న వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నాడు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను వినియోగించి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే నష్టాలు ఉండవు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ అధిక దిగుబడి సాధించవచ్చని పెళ్లకూరు మండలానికి చెందిన యువ రైతు నిరూపిస్తున్నాడు. గ్రామంలోని రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

– పెళ్లకూరు


నాణ్యమైన మొక్కజొన్న కంకులు
ఏపుగా పెరిగిన మొక్కజొన్న

- సేంద్రియ వ్యవసాయంతో తగ్గిన చీడపీడలు
- అధిక దిగుబడితో ఎక్కువ ఆదాయం
- ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతు

పెళ్లకూరు మండలంలోని చెంబడిపాళెం గ్రామానికి చెందిన మనుబోలు గణేష్ ఉన్నత చదువులు చదివి సేద్యం చేసేందుకు పార, పలుగు చేతబట్టాడు. తనకున్న 1.50 ఎకరాల భూమిలో వరి, చెరకు పంటలు సాగు చేశాడు. పలుమార్లు నష్టాలు రావడంతో అనేక కష్టాలు పడ్డాడు. ప్రతియేటా వరికి గిట్టుబాటు ధర లేకపోవడం, చెరకు పంటకు పరిశ్రమ యాజమాన్యం సకాలంలో నగదు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. గ్రామంలో చాలా మంది రైతులు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తుండడాన్ని గుర్తించి వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటల సాగు చేపట్టడం నేర్చుకున్నాడు.

మూడు పంటలు లక్ష్యంగా సాగు

స్వర్ణముఖినదీ తీరం కావడంతో సాగునీటికి ఇబ్బందులు లేకపోవడం వల్ల యేడాదికి మూడు పంటలు సాగు చేయాలనే లక్ష్యంతో సేద్యం పనులు చేపట్టాడు. ప్రతి పది రోజులకు 0.25 సెంట్ల భూమిలో విత్తనాలు నాటడం వల్ల వేర్వేరు దశల్లో పంట కాపునకు వచ్చేలా చేశాడు. ప్రారంభంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోయినా నిరాశ చెందకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ వంగ, బెండ, చిక్కుడు, కాకరతో పాటు మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. మొక్కజొన్నలో యూఎస్ 90, షుగర్ 75 రకాలు మొక్కజొన్న, తీపి మొక్కజొన్న విత్తనాలను ఎంపిక చేసుకున్నాడు. కేజీ విత్తనాలు రూ.2200 చొప్పున 1.50 ఎకరాలకు 6 కేజీల విత్తనాలను రూ.13,200 మేర కొని సాగు చేశాడు. పంట చేను సిద్ధం చేసుకోవడానికి, ఎరువులు, కోతదశలో కంకులు కోయడానికి మొత్తం రూ.40 వేల పెట్టుబడి పెట్టాడు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగాడు.

తగ్గిన తెగుళ్ల బెడద

సేంద్రియ ఎరువులను వినియోగించడంతో పంటలకు తెగుళ్ల బెడద లేకుండా పోయింది. పురుగు మందుల పిచికారీ ఖర్చులు తగ్గాయి. కొన్ని రోజుల తేడాతో ఒకే పంట సాగు చేయడంతో కోతకు వచ్చే సమయం కూడా పెరుగుతుందని గుర్తించాడు. కోసిన మొక్కజొన్న కంకులను తనకున్న తేలికపాటి వాహనంలో పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లి వీధివీధి తిరుగుతూ ఒక్కో కంకి రూ.10 చొప్పున విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు. ప్రస్తుతం వినాయక చవితి, దసరా పండుగల సమయం కావడంతో మొక్కజొన్నకు మంచి గిరాకీ ఉంటుందని వెల్లడించాడు. తనకు ఈ ఏడాది రూ.1.20 లక్షల వరకు రాబడి వస్తుందని రైతు గణేష్ చెప్పాడు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న బస్తాలు

మంచి లాభాలు వస్తాయి



నేను నాకున్న కొద్దిపాటి పొలంలో కూరగాయలతో పాటు మొక్కజొన్న (స్వీట్‌కార్న్) పంటను సాగు చేస్తున్నాను. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాను. పంట ఆరోగ్యంగా పెరుగుతోంది. చీడపీడలు కూడా పెద్దగా ఆశించలేదు. ప్రస్తుత సీజన్‌లో మొక్కజొన్నకు బాగా గిరాకీ ఉంది. నేను నా బండిలో కంకులు వేసుకుని సొంతంగా అమ్ముకుంటున్నాను. మంచి లాభాలు వస్తున్నాయి. **- గణేష్, రైతు**

ఈ సీజన్‌లో మంచి గిరాకీ ఉంటుంది

రుతుపవనాలు రాకతో తొలకరి జల్లులు పడుతున్నాయి. మొక్కజొన్న సాగుకు ఈ ప్రాంత వాతావరణం కూడా అనుకూలంగా ఉంది. స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతం కావడంతో సాగునీటికి పెద్దగా ఇబ్బంది లేదు. సేంద్రియ ఎరువులు వాడుతుండడంతో చీడపీడల బెడద కూడా లేదు. మండలంలో ఒకే ఒక రైతు మాత్రమే మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. రైతులు మార్కెట్ అనుకూలతపై అవగాహన కలిగి లాభాలు వచ్చే మంచి పంటలను ఎంపిక చేసుకోవాలి. తద్వారా ఆదాయం బాగా వస్తుంది.

- డాక్టర్ ప్రవీణ, ఏవో, పెళ్లకూరు

భూ సమస్యలపై అర్జీల వెల్లువ


ఫిర్యాదు చేస్తున్న మొదుగులపాళెం కాలనీ వాసులు

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ శైలకుమారి ప్రజల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు భూ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. మొదుగులపాళెం ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న చెరువు పోరంబోకు భూమిని కొందరు భూస్వాములు ఆక్రమించుకున్నారని, చెరువు కట్టను పూర్తిగా ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు ఎస్సీ కాలనీలోకి వస్తున్నట్టు వాపోయారు. స్పందించిన తహసీల్దార్ వీఆర్వోను పంపి విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు.

గిరిజన కాలనీలో అధికారుల పర్యటన


తిన్నెలపూడి లంక గిరిజన కాలనీలో బడి ఈడు పిల్లలతో అధికారులు


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటుకు చర్యలు

కోట : జిల్లా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్‌బాబు, ఏఎంవో శివశంకర్, ఎంఈవో–2 మస్తానయ్య మండలంలోని తిన్నెలపూడి లంక గిరిజన కాలనీలో పర్యటించారు. సుమారు 20 మంది వరకు బడి ఈడు పిల్లలను గుర్తించారు. సాక్షి దినపత్రికలో సోమవారం బడి బయటే బాల్యం శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. లంక గిరిజన కాలనీలో పర్యటించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. కాలనీలో గతంలో ప్రత్యామ్నాయ పాఠశాల ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ లంక గిరిజన కాలనీలో ప్రత్యామ్నాయ పాఠశాలను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడున్న పిల్లలందరికీ విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాఠశాల ఏర్పాటు కోసం పిల్లల తల్లిదండ్రులు ఖాళీగా ఉన్న భవనాన్ని చూపించగా అధికారులు పరిశీలించారు.

సాక్షి ఎఫెక్ట్..

వేమాలమ్మ తిరునాళ్లు ప్రారంభం


మోమిడిలో వేలమాలమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాల అలంకరణ

చిల్లకూరు : మండలంలోని మోమిడిలో వెలసిన వేమాలమ్మ మోమిడి, పునుగుంటపాళెం, వరగలి, మన్నేగుంట గ్రామాల ప్రజలకు ఇలవేల్పు. ఈ క్రమంలో వేమాలమ్మ తిరునాళ్ల ఆదివారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా మోమిడిలో తిరునాళ్లను ప్రారంభిస్తారు. తర్వాత పునుగుంటపాళెం, వరగలి, మన్నేగుంట గ్రామాల్లో గ్రామోత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు. చివరగా అమ్మవారిని ఆలయం వద్దకు తీసుకుని వస్తారు. మోమిడికి చెందిన వేమారెడ్డి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలను తొలిగా ప్రారంభించి అమ్మవారికి సారె అందజేస్తారు. అనంతరం గ్రామోత్సవం చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెడతారు. ఈ క్రమంలో సోమవారం రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులో భారీగా బాణసంచా పేలుస్తూ అమ్మవారి ఊరేగింపు చేపట్టారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

వాకాడు/నాయుడుపేట టౌన్ : వాకాడు మండలంతోపాటు నాయుడుపేట పట్టణంలో సోమవారం అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా చెప్పుకునే రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. బయట ప్రాంతాల్లో స్థిరపడిన అక్కాచెల్లెళ్లు సొంత గ్రామాలకు చేరుకుని తమ సోదరులకు ప్రేమతో రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. అక్కా తమ్ముడు, అన్నా చెల్లెలు తమ బంధాలను గుర్తు చేసుకుంటూ రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి వారి ఆశీస్సులు పొందారు. మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం సాయిప్రసూన విద్యార్థులతో రాఖీలు కట్టించి పండుగ విశిష్టతను తెలియజేశారు. నాయుడుపేటలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చెందిన మహిళలు పలు ప్రాంతాలకు వెళ్లి అధికార, అనధికార ప్రముఖులకు రక్షాబంధన్‌లు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని నిరసన

గూడూరు రూరల్ : గూడూరురూరల్ పరిధిలోని విందూరు ఎస్టీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం గిరిజనులతో కలిసి గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అధికారులు స్పందించి గిరిజనులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు జోగిశివకుమార్, బీవీ రఘు, సురేష్, అడపాల ప్రసాద్, పుట్టాశంకరయ్య, కాలనీ వాసులు వెంకటయ్య, రమణమ్మ, శ్రీను, సుబ్రమణ్యం, రాజ్యలక్ష్మి, నారాయణ పాల్గొన్నారు.

ఆటోలోనే డ్రైవర్ మృతి

చిల్లకూరు : మండలంలోని నెలబల్లిరెట్టపల్లి సమీపంలో సోమవారం ఒక డ్రైవర్ ఆటోలోనే మృతి చెందాడు. మండలంలోని నల్లాయగారిపాళెంకు చెందిన నందిపాక వెంకటరమణయ్య (29) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఓడూరులో పని చేసేందుకు సోమవారం కొంతమంది కూలీలను తీసుకుని వెళ్లాడు. తనకు నలతగా ఉందని ఆస్పత్రికి వెళుతున్నట్టు చెప్పాడు. నెలబల్లిరెట్టపల్లి వద్ద ఆటోలో పడుకున్నాడు. అటుగా వెళ్లిన కొంతమంది అతను మృతి చెందినట్టు అనుమానించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు చిల్లకూరు పీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ అరాఫత్ పరీక్షించి అతను అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు.

నృసింహునికి తులసీ దళాలతో అర్చన


తులసీ దళాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు, వేదపండితులు


గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా తులసీ దళాలతో అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. తులసీ దళాలు స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రం. ఈ క్రమంలో తులసీ దళాలతో స్వామిని సేవిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని అర్చకులు తెలిపారు. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 9 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. తదుపరి శ్రీవారి నందనంలోని ప్రత్యేక మండపంలో ఆశీనులను చేసి తులసీ దళాలతో అభిషేకం చేశారు. రాత్రి గరుడ వాహనంపై కొలువుదీర్చి కోనలో ఊరేగించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, డీసీ విద్యాసాగర్‌బాబు, ప్రధానార్చకులు సీతారామయ్య స్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, నాగరాజస్వామి, మల్లికార్జునస్వామి, మోక్షజ్ఞస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ యాగం


చండీ యాగం సామగ్రిని అర్చకులకు ఇస్తున్న దాతలు

చిల్లకూరు : మండలంలోని తీర ప్రాంతం తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని చండీ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా ఆలయంలో లోక కల్యాణం కోసం చండీ యాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చండీ యాగం నిర్వహించారు. ఈవో నవీన్‌కుమార్ మాట్లాడుతూ చండీ యాగంలో పాల్గొనాలనుకునే భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం



కలశాల్లో పవిత్ర జలాలు తీసుకువస్తున్న అర్చకులు


చిట్టమూరు(వాకాడు): మండలంలోని మల్లాంలో దుర్గమ్మ ఆలయ జీర్ణోద్ధరణను గ్రామస్తులు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలను చేపట్టారు. గ్రామానికి చెందిన నూతలపాటి సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు సుధీర్‌శర్మ కుంభాభిషేకం, హోమం, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఆకుల ఆదిశెట్టి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, ఆదెయ్యశెట్టి, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హరిబాబురెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఆదినారాయణశాస్త్రి పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలో వెలసిన సిద్ధలయ్య కోనలో సోమ వారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మహిళలకు రక్షణ కల్పించాలి


టవర్ క్లాక్ వద్ద ప్రదర్శన చేస్తున్న ఆదిశంకర విద్యార్థులు


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థినులు

గూడూరు రూరల్ : దేశంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను నివారించి, మహిళలకు రక్షణ కల్పించాలని గూడూరులోని ఆదిశంకర ఇంగ్లీషు మీడియం స్కూల్, డీఆర్‌డబ్ల్యూ కళాశాల విద్యార్థినులు నినదించారు. వారు సోమవారం గూడూరులో భారీ ర్యాలీ చేపట్టారు. టవర్ క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ కోల్‌కతాలో డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేవైఎం ప్రతినిధి గిద్దలూరు మనోజ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు శశికుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఓజిలి: మండలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రజనీకాంత్ ఆదేశించారు. ఆయన సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. బోర్ల మరమ్మతులకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రతి కుటుంబానికీ వంద రోజుల పనులు కల్పించాలని చెప్పారు. ఈవోపీఆర్డీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం

సైదాపురం : రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వీఆర్వోలను తహసీల్దార్ ఆదేశించారు.

గూడూరు రూరల్ సీఐగా కిషోర్‌బాబు



చిల్లకూరు: గూడూరు రూరల్ సీఐగా కిషోర్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వేణుగోపాల్ రెడ్డి బదిలీ అయ్యారు. సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ నేరాల అదుపునకు కృషి చేస్తానన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

వాకాడు ఎస్ఐ బాధ్యతల స్వీకరణ


ఎస్ఐ నాగబాబు

వాకాడు: వాకాడు ఎస్ఐగా నాగబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కోట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ పవన్‌కుమార్ బదిలీపై కోటకు వెళ్లారు. నాగబాబు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్నారు.

అధునాతన సాంకేతికను అందిపుచ్చుకోవాలి

కోట: విద్యార్థులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యలో రాణించాలని నాసా విశ్రాంత శాస్త్రవేత్త దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో విద్యార్థులకు రోల్ ఆఫ్ ఇన్నోవేషన్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఎకనామిక్ గ్రోత్ అనే అంశంపై అవగాహన కల్పించారు. యువత ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహంతో స్టార్టప్ కంపెనీలను ఏర్పాటు చేసి ప్రగతి పథంలో దూసుకెళ్లాలన్నారు. భారతదేశం రాబోయే రోజుల్లో ఇన్నోవేషన్స్ ద్వారా ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగం హెచ్‌వోడీ విక్రమ్‌కుమార్, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పి.ఎ.సి.ఎస్ సభ్యుల KYC నమోదు కొరకు పత్రికా ప్రకటన

ది నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లి., వెంకటగిరి బ్రాంచ్ పరిధిలో గల ఈ దిగువ తెల్పిన 7 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘములందు గల సభ్యులందరు సహకార సంఘముల కంప్యూటరీకరణలో భాగంగా తమ KYC వివరములను తప్పనిసరిగా డిజిటలైజేషన్ కొరకు తమ పేర్లు సంఘము నందు నమోదు చేయించుకొనవలెను. సంఘములో సభ్యత్వము తీసుకొని ఇప్పటివరకు ఏవిధమైన లావాదేవీలు జరపని సభ్యులు కూడా సంఘములో సభ్యునిగా కొనసాగాలంటే తమ రికార్డులను వెంటనే డిజిటలైజేషన్ చేయించుకొనవలసినదిగా కోరడమైనది. ఇందు కోసం ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ జెరాక్స్‌లు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఫోన్ నెంబర్‌తో ఆయా సంఘ కార్యాలయము నందు ఈ ప్రకటన వెలువడిన 15 రోజుల లోగా పై వివరములను తప్పనిసరిగా సమర్పించవలెను. లేని యెడల అట్టి సభ్యత్వమును రద్దు చేయబడునని తెలియజేయడమైనది.

1. వెంకటగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము నెంబరు : L.1092 వెంకటగిరి - వెంకటగిరి మండలం.
2. లాలాపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము నెంబరు : L.1742 లాలాపేట - వెంకటగిరి మండలం.
3. యాతలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము నెంబరు : L.1490 యాతలూరు - వెంకటగిరి మండలం.
4. బాలాయపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము నెంబరు : V.813 బాలాయపల్లి - బాలాయపల్లి మండలం.
5. యాచవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము నెంబరు : V.473 యాచవరం - బాలాయపల్లి మండలం.
6. నిడిగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము నెంబరు : L.1336 నిడిగల్లు - బాలాయపల్లి మండలం.
7. బైరవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము నెంబరు : V.487 బైరవరం - బాలాయపల్లి మండలం.

సం/- ముఖ్య కార్యనిర్వహణాధికారి

● వెంకటగిరి పి.ఎ.సి.ఎస్ ● లాలాపేట పి.ఎ.సి.ఎస్ ● యాతలూరు పి.ఎ.సి.ఎస్ ● బాలాయపల్లి పి.ఎ.సి.ఎస్ ● యాచవరం పి.ఎ.సి.ఎస్ ● నిడిగల్లు పి.ఎ.సి.ఎస్ ● బైరవరం పి.ఎ.సి.ఎస్

వెంకటగిరి : 18-08-2024